

# తోడొకరుండిన....

- శారద పోలంరాజు



*(గత సంచిక తరువాయి)*

సీమంతం సమయానికి పూర్ణిమ మేనత్త అనసూయతో వచ్చిన కూతురు కాంతను మొదటి సారి చూస్తున్నారేమో, రేణుకకు, కుసుమకు ఆ పిల్ల పోకడలు కొంత వింతగా అనిపించింది. అరగంటకొకసారి అద్దం ముందు నిలబడటం, అటు తిరిగి ఇటు తిరిగి చూసుకోవటం, అవసరం వున్నా లేకపోయినా పవిటను సర్దుకోవటం, మళ్ళీ మళ్ళీ మొహానికి పౌడర్ అద్దుకొని తల దువ్వుకోవటం చూస్తుంటే విచిత్రంగా వుంది.

"ఎవరు పూర్ణిమా ఆ అమ్మాయి?"

"అదా! మా అనసూయ అత్తయ్య కూతురు కాంతంలే." తేలిగ్గాతీసి పారేస్తూ చెప్పింది.

దాదాపు తమ వయసే వున్న ఆ అమ్మాయిని పరిచయం చేసుకుందామనుకున్నారు. కాని పూర్ణిమ వారించింది. "అమ్మో దాన్ని కదిలించవద్దు. అది మన లాగా కాదు. దానితో మాట్లాడటం అంటే ఒక కందిరీగల తుట్టెని కదిలించటమే." అంటూన్నా వినకుండా, "నీది మరీ విచిత్రమే. మన తోటి అమ్మాయేగా! ఫ్రెండ్‌షిప్ చేసుకుందాం." అంటూ, "హలో నీ పేరేమిటి?" అని సంభాషణ ప్రారంభించబోయింది కుసుమ.

మొహం చిట్లించి, "కాంత." అంది మెలికలు తిరుగుతూ. "అయినా హలో ఏమిటి? ఎదురుగానే వున్నానుగా! ఫోన్లో మాట్లాడుతున్నట్టు ఆ హలో లేమిటి?"ఆ హావభావాలు తల ఒక పక్కకు వంచి ఓర చూపులు చూడటం, మాటిమాటికి జారకుండానే పమిటతీసి మళ్ళీ సర్దుకోవటం అన్ని కూడా సహజంగా చేస్తున్నట్టు కాక, ఎంతో ప్రాక్టీస్ చేసి అలవాటు చేసుకున్నట్టు కనిపిస్తున్నది.

"నా పేరు కుసుమ, తన పేరు రేణుక. మేము పూర్ణిమ ఫ్రెండ్స్."

"అయితే ఏమిట్ట? నాకెందుకు చెప్పుతున్నారు?"

ఒక్కసారి గతుక్కుమన్నది. "ఆఁ ఏంలేదు. నువ్వు కూడా మా వయస్సేగా! ఫ్రెండ్‌షిప్ చేద్దామని పలకరించా. అంతే. ఏం చదువుతున్నావు?"

"ఇదిగో సెక్రటరి నవల చదువుతున్నాను."

"అహఁ అదికాదు. ఏ కాలేజీలో చదువుతున్నావు?"

"ఛీ........ నాకు కాలేజీలో చదవాల్సిన కర్మమేంటిట? అవన్నీ మీ బోటి వాళ్ళకు. ఈ ఏడు మా అమ్మ నాకు పెళ్ళి చేద్దామనుకుంటున్నది. చదువులంటూ బయటకు వెళ్ళితే ఇంకేమన్నా వుందా? అసలే పచ్చటి వళ్ళు నాది. ఆ కాస్త ఎండకు నల్లబడదూ? అందుకే ఎనిమిదో క్లాసు తరువాత నుండి ఇంటి పట్టునే వుంటున్నాను." చేతులు తిప్పుతూ పెద్ద ఆరిందాలా మాట్లాడింది.

"అయినా ఇన్నాళ్ళూ మాబావ కిచ్చిచేద్దామనుకున్నారు. కాని వాడేమో కాలేజీ చదువులు చదివినా ఆ పల్లెటూర్లోనే వుండిపోతాడట.

నాకేం కర్మ పల్లెటూర్లో పడుంటటానికి? ఎంచక్కా ఏ డాక్టర్నో ఇంజనీర్నో పెళ్ళి చేసుకొని బొంబాయికో అమెరికాకో వెళ్ళిపోదామనుకొని నేనే వాడిని చేసుకోనన్నాను." అమాయకత్వమో అయోమయమో వెర్రిబాగులతనమో తెలియటల్లేదు. పెద్దపెద్ద కళ్ళు గుండ్రంగా తిప్పుకుంటూ వివరించింది.

ఈ లోగా అనసూయ కూడా అప్పుడే వదినలతో చెప్పటం వినిపించింది.

"అన్నయ్యా, కాంతకి ఏదైనా మంచి పట్నం సంబంధం చూడరాదూ?"

"అదేంటమ్మాయ్, మీ మేనల్లుడికిద్దామనుకుంటిరిగా! ఇప్పుడు పై సంబంధం ఎందుకు?"

"ఆఁ ఆ వెధవకు చదువుకున్న పిల్ల కావాలట. వాడికళ్ళకు మన కాంత చదువు కంటికానలేదు. వెధవ. వాడుకాకపోతే లోకం గొడ్డుపోయిందా?

"అయినా అనసూయా, దాన్ని ఆమేన గెడకర్రలా పెంచావు. ఒక పనీలేదు. పాటా లేదు. తినటం మంచానికి అడ్డంగా పడుకొని ఆ దిక్కుమాలిన నవలలు చదవటం తప్ప మరోటి లేకుండా పెంచావు. దాని తోటి పిల్లలు చూడు. చక్కగా కాలేజీలలో చదువుతున్నారు. ఇంట్లో పనిపాటలు చక్కపెట్టుకుంటున్నారు. వాళ్ళను చూసైనా నేర్చుకుంటుందేమో ననుకుంటే అదీ లేదు. పొద్దస్తమానూ ఆ అద్దం ముందర నిలబడి సింగారాలకే టైం చాలటల్లా." జానకమ్మ నిలేసింది.

"చాల్లేమ్మా. చిన్నప్పటి నుండి  నా కూతురంటే కళ్ళల్లో నిప్పులు పోసుకుంటావు. ఇప్పటికే కొల్లలు కొల్లు గా సంబంధాలు వస్తున్నాయి. అయినా నా కూతురి అందమైన కళ్ళు చూసే కాణీ కట్నం కూడా లేకుండా చేసుకోవటానికి ఎన్నెన్నో సంబంధాలు వస్తున్నాయి. కాని నాకేమో దానికి ఒక డాక్టర్నో ఇంజనీర్నో చూసి చేద్దామని వుంది."

"పోనీ కట్నం ఏ మాత్రం ఇవ్వగలుగుతావే?"

"పోయినేడు మా మామగారు ఆస్తి పంపకాలు చేయబట్టి కాని. లేకపోతే నిరుడు మా మేనల్లుడికి పదివేలు కట్నం ఇద్దామనుకున్నాము. ఆ వెధవాయికి కళ్ళు కాళ్ళు నేలమీద ఆనక చదువుకున్న అమ్మాయి సంబంధం ఖాయం చేసుకున్నాడు.

ఇప్పుడు మటుకేం. నాలుగు వేలదాకా ఇవ్వటానికి సిద్దంగా వున్నాము. అన్నదమ్ములు మీరంతా తలా ఒక చెయ్యి వేయకపోతారా? మీ ఎరికలో ఏదైనా మంచి సంబంధం చూసి పెట్టన్నయ్యా."

"అనసూయా, అత్యాశలకు పోయి ఎగిరి కాళ్ళు విరగ్గొట్టుకోకు. మనకు తగ్గ సంబంధం ఏదైనా వుంటే చెప్పుతాలే. అంతే కాని డాక్టర్లు ఇంజనీర్లు అంటే మాటలు కాదు. వాళ్ళంతా ఇరవై పాతిక వేలు కట్నం ఇవ్వందే మనకు అందుబాట్లో వుండరు. ఆ తర్వాత పెళ్ళికి పై ఖర్చులు మరో పదివేలు. ఆ విషయం మనసులో పెట్టుకొని ఆలోచించుకోండి. అటు చదువులేక ఇటు కట్నాలు ఇచ్చుకోలేక అంతంత పెద్ద సంబంధాలు మనకు అందుబాటులోవుండవు."

"అక్కయ్యా, నువ్వంటుంటే గుర్తుకొచ్చింది. మా స్నేహితుడి తమ్ముడు ఇక్కడే గవర్నమెంట్లో యుడిసి గా వున్నాడు. వాళ్ళకు పెద్దగా కట్నాలమీద ఆశలేదు. కావాలంటే మాట్లాడుదాము." సుందరం అన్నాడు.

మొహం వికారంగా చిట్లించింది. "యుడిసి అంటే గుమాస్తానేగా? అయినా బోడి గుమాస్తా కూడా ఒక సంబంధమేనా! అరేయ్ నీకు చేతనైతే నే చెప్పినట్టు ఏవైనా సంబంధం వుంటే చెప్పు. అంతే కాని ఇట్టాంటి చవకబారు అణా కాణీ సంబంధాలు మాత్రం చెప్పవద్దు." విసురుగా అక్కడి నుండి వెళ్ళిపోయింది.

జానకమ్మ విసుక్కుంది. "ఇదొక మూర్ఖురాలు. దానికి తెలియదు. ఒకరు చెప్పితే వినే లక్షణం ఏ కోశానా లేదు. దాన్ని చూస్తే ఆ అద్దం ముందర నుంచి కదిలే సూచనే లేదు. పాపం దాని బతుకు ఎట్లా తెల్లవారుస్తుందో ఈ అనసూయ." అంటూ కొడుకులు కోడళ్ళదగ్గర

వాపోసాగింది.

"పోనీలేమ్మా, ఎవరి కర్మకు ఎవరు భాధ్యులు. ఇప్పుడు ఇంకా ఏమైనా అన్నావంటే శుభకార్యమని కూడా చూడకుండా ఏడ్చి యాగీ చేస్తుంది. దాని సంగతి తరువాత మాట్లాడుదాములే." ఆ పాటికి కొడుకు మాట తప్పించేసాడు.

"విన్నావా కుసుమా? అందుకే కాంతను కదిలించవద్దన్నాను. వాళ్ళ బాబాయి పిల్లలు పెద్దనాన్న పిల్లలు అందరు కూడా చక్కగా కాలేజీలలో స్కూళ్ళల్లో చదువుకుంటున్నారు. అసలు మా అత్తయ్యే దాన్ని అట్లా తయారు చేసింది.

చిన్నప్పటి నుండి దానికి తాను ఎంతో అందగత్తెనన్న భావన మనసులో బాగా నాటుకుపోయింది. తన అందం పెద్దపెద్ద కళ్ళు చూసి ఏ రాకుమారుడో వస్తాడని కలల లోకంలో విహరిస్తూ వుంటుంది. సెక్రటరీ నవలలో హీరోయిన్ అనుకుంటూ వుంటుంది. రాజశేఖరం, పడవలాంటి కారు, బొచ్చుకుక్క, పెద్ద బంగళా. కదిలిస్తే ఇవే దాని కలలు. దాని చేతిలో నిరంతరం ఆ నవల వుండాల్సిందే. ఎన్ని వందల సార్లు చదివిందో! కంఠోపాఠం..!

"చిన్నప్పటి నుండి నాయనమ్మ నెత్తి నోరుమొత్తుకొనేది. చదివించవే అని అత్తయ్యకు, చదువుకోవే అని కాంతకు. అహ వింటేనా? గతి లేని వాళ్ళకే చదువులని వాళ్ళ అభిప్రాయం. ఇంక దానిని పలుకరించే ప్రయత్నం చేయవద్దు."

ఇల్లంతా సందడే సందడి. మధ్యమధ్యలో సునంద మేనమామ ఆయన భార్య ఒకసారి, బాబాయిలు పినతల్లులు ఒకసారి వచ్చి చూసి పోవటం, అందరూ తిరిగి ఒకటవటమూ అందరికి ఆనందదాయకంగా వుంది.

ఈ మార్పులన్నిటికీ సంధాన కర్త అయిన కుసుమను అంతా మనసారా అభినందించారు.

జానకమ్మగారైతే, "ఓసినీ ఇల్లు బంగారం గానూ, మొన్నమొన్నటిదాకా అనాథనంటూ ఒకటే ఏడిచేదానివి కాదుటే? అంతలో ఇంత మొనగత్తెవైపోయావా? నా తల్లి, నీ పుణ్యమా అని సునంద మొహంలో మళ్ళీ పాత కళ వచ్చింది కదే? చిన్నదానివైనా ఎవరికీ రాని ఆలోచన నీకెట్లా వచ్చిందే? ఐనా చదువుకున్న పిల్లలు చదువుకున్న పిల్లలే." అంటూ రోజుకొకమారైనా అంటూ వుంది. ఆమెకు నిజంగానే కోడలి కళకళ్ళాడే మొహం చూసేటప్పటికి పరమానందంగావుంది.

చదువులు చదువుకుంటున్న అమ్మాయిలంటే జానకమ్మకు అపరిమితమైన ఆప్యాయత. ఎవరైనా కొత్త ఆడపిల్లలు కనిపిస్తే, ఆవిడ ముందుగా అడిగే ప్రశ్న, "అమ్మాయీ ఏం చదువుతున్నావే?"

చిన్న తనాన అక్షర జ్ఞానం వున్న ఆవిడ తీరిక సమయాల్లో ఏదో ఒకటి చదువుతూనే వుంటుంది. కొడుకులు చదువుకొనే రోజుల్లోనే వాళ్ళకు దిద్దిస్తూ తను కూడా ఇంగ్లీష్ అక్షరాలు చదవటం నేర్చుకుంది. అక్కడితో ఆగక ఇంట్లో వున్న రాజాజీ రామాయణం కూడబలుక్కుంటూ చదివేది. అర్థం కాని పదాలు మనుమలను అడిగి తెలుసుకునేది.

అసలు ఆవిడ ముందు తరానికి ఈ తరానికి కూడా ఆదర్శప్రాయురాలిలా అనిపించేది.

లేనిపోని బడాయిలకు పోయిన అనసూయ కాంతం పెళ్ళిచేయటానికి నానా తంటాలు పడింది. మా పిల్ల అందం చూసే డాక్టర్లు ఇంజనీర్లు పెళ్ళికొడుకులు క్యూ కడుతారు అని మహా మురిసిపోయింది. చివరకు అన్నదమ్ములకు కూడా సంప్రదించకుండా ఒక సంబంధం ఖాయం చేసుకుంది. ఆ కుర్రవాడికి కనీసం డిగ్రీ కూడా లేదు. ఏదో చిన్న కంపెనీలో వుద్యోగం. కాకపోతే కంపెనీ తరపు నుండి అమెరికా పంపిస్తున్నారని చెప్పేటప్పటికి ఆ మాయమాటల మోజులో పడిపోయి ముందు వెనక చూడకుండా పెళ్ళి చేసేసారు.

అంతా కుదుర్చుకున్న తరువాత తెలిసిన అన్నలు ఇంక ఏమీ అనలేక మూగ ప్రేక్షకులు అయినారు.

ఇదిగో వచ్చేనెలే మా ప్రయాణం అన్నాడు.

కుసుమకు అనుమానం వచ్చింది. "కాంతం నీకు పాస్‌పోర్ట్ వుందా?"

"ఏమోనబ్బా అవన్నీ నాకు తెలియవు? అయినా అన్నీ మా ఆయన చూసుకుంటారు."

అమెరికాకు వెళ్ళటమంటే విజయవాడకు వెళ్ళటం అన్నంత సులువుగా అనుకుంటున్నారు తల్లి కూతురు. అనసూయ అఘాయిత్యం తెలిసిన అన్నతమ్ములు వాళ్ళ విషయంలో కలుగచేసుకో తలుచుకో లేదు. ఏది జరిగితే అదే జరుగుతుంది అని నోరు మూసుకొని వుండిపోయినారు. అతను ఒకరోజు హఠాత్తుగా వచ్చే వారమే మా అమెరికా ప్రయాణం అనేటప్పటికి అనసూయ సామాను సర్దే హడావుడిలో పడిపోయింది. పచ్చళ్ళు పొడులూ సర్దటానికి వుపక్రమించింది.

కాని అతను, "ఇప్పుడవేమీ వద్దు అత్తయ్యగారూ, ఒక చిన్నపెట్టెలో బట్టలు సర్దండి చాలు. మళ్ళీ వచ్చే నెల్లో వస్తాముగా అప్పుడు అన్ని పట్టుకెళ్ళుతాములేండి." అనిచెప్పాడు.

తతిమ్మ వాళ్ళంతా ఈ నాటకం ఏ విధంగా ముగిస్తాడో అని ఆరాటంగా ఎదురు చూడటం తప్ప ఏమీ చేయలేకపోయినారు.

రెండు రోజులలో ప్రయాణం అనగా మొహం వేల్లాడేసుకొని వచ్చాడు. "అక్కడ మా కంపెనీలో ఏదో ప్రాబ్లం వచ్చిందట. అందుకని ఈ సంవత్సరం మేము వెళ్ళటం కుదరటల్లేదు. వచ్చే ఏటికి వెళ్ళుతాము."

తల్లి కూతురు ఆ మాటలు కూడా నమ్మేసారు. వాళ్ళిద్దరికి తప్ప మిగతా అందరికి అతను చేసిన మోసం బాగా అర్థం అయింది. అమెరికా అనే వల విసిరాడు. ఆ వలలో కాంతం చిక్కుకుపోయింది. ఇంక దాంట్లో నుంచి బయటకు వచ్చే ప్రసక్తే లేదు.

కాలేజీ గేటులోకి ప్రవేశించగానే మొత్తం పండుగ వాతావరణం. పెద్దపెద్ద బానర్లు తగిలించి వున్నాయి. సెవెన్ స్టార్ సిండికేట్ అన్న బోర్డ్లు కనిపిస్తున్నాయి. లూసీ జీవితాన్ని పెద్ద మలుపు తిప్పి తిరుగులేని ఇనపచట్రాలలో బంధించటానికి కారణమైన బారికేడ్లు గార్డెన్ చుట్టూతా కనిపించాయి.

జరగ బోయే సంఘటనలకు ఆ కార్యక్రమాలే మూలం అవబోతున్నాయని ఏ మాత్రం ఆలోచన వచ్చినా నలుగురూ వచ్చిన దారినే వెనక్కు వెళ్ళిపోయే వారేమో!

కాని విధి రాతను ఎదిరించటానికి మానవ మాత్రులకు సాధ్యమయ్యేటట్టే వుంటే ఇన్ని కష్టాలెందుకు? కన్నీళ్ళెందుకు.

ఆ సుడిగుండంలోకి నలుగురు కాలు పెట్టారు.

"ఏంటే తరుణీ ఈ హడావుడి? ఈ సెవెన్ స్టార్ సిండికేట్ ఏమిటో" పూర్ణిమ అనుమానం వ్యక్త పరిచింది.

"అవును పూర్ణిమా నిన్న అనుకుంటుంటే విన్నాను. అదొక స్టూడెంట్స్ కల్చరల్ ఆర్గనైజేషన్. ఈ రోజు నుండి మూడు రోజులు మన కాలేజీలో ప్రోగ్రాంస్ వున్నాయని విన్నాను."

"మరి మనకు క్లాసులు ఏం వుంటాయి? అనవసరంగా వచ్చామేమో. ముందే తెలిసి వుంటే హాయిగా ఇంట్లోనే వుండేవాళ్ళమేమోగా!" కుసుమ నిస్పృహగా అన్నది.

"ఇంట్లో కూర్చోవటం దేనికి? మనం కూడా ప్రోగ్రాం ఎంజాయ్ చేద్దాం."

"అబ్బో చాలామంది వస్తున్నట్టున్నారే. బాయ్స్ కూడా వచ్చారు."

"మరి ఇంటర్ కాలేజీ ప్రోగ్రాం అంటే  అందరూ వుంటారు కదా!"

"ఏయ్ అక్కడ మన లూసీని చూడండి. ఇప్పటిదాకా మనతోనే వుందిగా! మన మాటల్లో మనం మునిగాము. తను వెళ్ళి ఆ టూరిస్ట్ గ్రూప్ తో కలిసి కూర్చున్నది చూడండే."

"పోనీయండే, తను మన దగ్గరకు వచ్చిందా వెల్ అండ్ గుడ్. లేదా లెట్ హర్ గో టు హెల్."

"లూసీనే కాదు ఇంకా కొంతమంది కూడా వాళ్ళచుట్టూ చేరి భజన చేస్తున్నట్టు కనిపిస్తున్నది."

"వాళ్ళ కర్మ. మనకెందుకు. వాళ్ళంతా ఫారెన్ నుండి వచ్చారు. అమ్మ నాన్నలు అంతా మాడ్రన్ పీపుల్. వాళ్ళేమి చేసినా చెల్లుతుంది. అంతే కాని మన బోటి వాళ్ళం వాళ్ళతో కలిస్తే రెంటికి చెడ్డ రేవడిలాగా మిగిలి పోతాము. వాళ్ళచుట్టూ తిరిగే వాళ్ళకు వుండాలి ఆ జ్ఞానం."

"అందరి సంగతి అటుంచి మనం కనీసం లూసీనైనా హెచ్చరిద్దాం." కుసుమ ఆవేదనగా అంది.

"కుసుమా, నువ్వు అనవసరంగా ఆ లూసీ గురించి ఆవేదన చెందుతున్నావు. తనేమీ చిన్నపిల్లకాదు కదా ఒకళ్ళ చేత చెప్పించుకోటానికి. అయినా నువ్వంతగా ఆరాటపడుతున్నావు కాబట్టి ఈ ఫంక్షన్ అయిపోయిం తర్వాత వీలు చూసుకొని మాట్లాడుదాములే. ఇప్పటికి పోనీయ్." సర్ది చెప్పింది తరుణి అలవాటు ప్రకారం.

ఏ కాలేజీ నుండి వచ్చారో, కొంతమంది అబ్బాయిలు ఒక గ్రూప్ గా చేరి వెనక సీట్లలో కూర్చొని బుద్ధిగా కార్యక్రమాలు చూస్తున్నారు. అందరూ లేటెస్ట్ ఫాషనైన సైడ్ లాక్స్ పొడుగ్గా భుజాలదాకా వున్న హైర్ స్టైల్ బెల్‌బాటం పాంట్స్ వేసుకొని వున్నారు. లూసీ మరికొంతమంది అమ్మాయిలతో కలిసి ఆ అబ్బాయిల వెనకే చేరారు.

స్థాన బలిమి కాని తన బలిమి కాదన్నట్టు మగపిల్లలు బుద్ధిగా కూర్చుంటే వాళ్ళను ఏడిపిద్దామని వెనక కూర్చున్న అమ్మాయిలకు చిలిపి కోరిక కలిగింది.

మెల్లిగా అల్లరి మొదలయింది. అబ్బాయిల మీద పాటలు పాడటం.

పాపం ఆ అబ్బాయిలు చాల ఇబ్బందిగా ఫీలవసాగారు.

మిగతా స్టూడెంట్స్ అంతా ఇది గమనిస్తూ వున్నారు. అట్లాగే దూరం నుండి ఇదంతా చూస్తున్న పూర్ణిమ వాళ్ళకు కూడా చాల ఇబ్బందికరంగా వుంది. కాని ఏం చేయాలో తెలియటం లేదు. కుసుమైతే కోపంతో మండిపడుతోంది. "ఈ లూసీకి బుద్ధి లేదా ఏం? వుండు నేను మేడంకు చెప్పుతాను" అంటూ ఆవేశంగా లేవబోయింది.

తక్కిన ఇద్దరూ బలవంతంగా చేయిపట్టుకొని లాగి కూర్చో బెట్టారు.

"దానికి బుద్ధి లేకపోతే నీ బుద్ధేమయింది? ఇప్పుడు మేడంకు కంప్లైంట్ చేస్తే పోయేది మన కాలేజీ పరువే. ఈ సంగతి బయటకు పోతే కాలేజీలో వున్న అమ్మాయిలంతా ఇట్లాంటి వాళ్ళేననుకుంటారు బయటి జనం. అయినా మనమే కాదు అందరూ గమనిస్తూనే వున్నారు. లెక్చరర్లు మటుకు చూడకుండా వుంటారా? నువ్వు నోరుమూసుకు కూర్చో. లూసీ సంగతి తరువాత చూద్దాం." ఇద్దరూ కుసుమను బలవంతంగా ఆపారు.

ఆ విధంగా రెండురోజులు గడిచాయి. వెనక చేరిన ఆడపిల్లల ఆగడాలు హద్దుమీరినట్టే కనిపిస్తున్నది.

మూడోరోజు పొద్దున కాలేజికి వచ్చేటప్పటికి ఆడపిల్లల మాటలకు బలైపోతున్న అయిదుగురు కుర్రాళ్ళూ గార్డెన్‌లో లాన్ లో కూర్చొని ఏదో నెమ్మదిగా మాట్లాడుకుంటూన్నారు. వాళ్ళ హావభావాలు చూస్తుంటే ఏదో పెద్ద విషయం మీదనే చర్చ జరుగుతున్నట్టుగానే వుంది. కొంపదీసి ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేస్తారా ఏమిటి? ఏక్షన్ తీసుకుంటే లూసీ గతి ఏం కాను? అందరికి దిగులుగా వుంది.

అల్లరి చేసిన అమ్మాయిలలో స్మిత అనే అమ్మాయి ప్రతిరోజూ వీళ్ళ బస్‌లోనే ఎక్కి బషీర్‌బాగ్ దిగి పబ్లిక్ గార్డెన్‌వైపు నడిచి అక్కడ సందులోకి వెళ్ళిపోతుంది. అక్కడి నుండి చాల దూరం నడవాలి. అదృష్టం బాగుండి రెడ్ సిగ్నల్ పడితే గబుక్కున చౌరాస్తాలో దిగిపోతుంది. తరుణి పూర్ణిమ టాంక్‌బండ్ స్టేజిలో దిగి కిందనున్న కాలనీకి వెళ్ళుతారు.

కాలేజీ గేటు బయటకు వస్తూ ఎందుకో వెనక్కి చూసిన అమ్మాయిలకు అబ్బాయిల గుంపులో ఎర్ర షర్ట్ వేసుకొని సైడ్ లాక్స్,

బెల్‌బాటం పాంటు వేసుకున్న అబ్బాయి, అతనితో పాటు ఇంకొకడు వస్తూ కనిపించారు.

దూరంగా లూసీ మెడికల్ కాలేజీ దాటి పోతూవుంది. ఆమె వెనక అబ్బాయిల గ్రూప్లో ఒక అబ్బాయి వెళ్ళటం కనిపించింది. అంటే పొద్దున వాళ్ళ చర్చల ఫలితమన్నమాట. ఒక్కక్క అబ్బాయి ఒక్కొక్క అమ్మాయి వెనక పడటం ఆ తర్వాత ఏం చేద్దామని వాళ్ళ వుద్దేశ్యమో?

డబల్‌డెక్కర్ బస్ వచ్చింది. అందరూ తోసుకుంటూ ఎక్కారు. ఎర్ర షర్ట్ వాడు ఎక్కాడు. బస్ నిండుగా వుంది. స్మిత నెమ్మదిగా వెనక్కు వెనక్కు పోయి పైకి పోయే మెట్ల కింద సెటిలయి నిలబడింది. ఎర్ర షర్ట్ అతను ఎంట్రన్స్ దగ్గరే నిలబడటానికి ప్రయత్నం చేశాడు. కాని డబల్‌డెక్కర్ అవటాన దిగేవాళ్ళకు ఎక్కేవాళ్ళకూ ఒకటే డోర్.

కండక్టర్ వచ్చి అక్కడ నిలబడ్డ మగవాళ్ళని అదిలించాడు. "లోపలికి నడవండి సార్, ఎక్కేదిగే వాళ్ళకు ఇబ్బంది. నడవండి నడవండి" అంటూ తోసేటప్పటికి ఆ కుర్రాడు లోపలికల్లా వెనక్కి వెళ్ళిపోవలసి వచ్చింది. పాపం దాదాపు డ్రైవర్ కాబిన్ వరకు తోయబడ్డాడు. ప్రతి స్టాప్ లోనూ స్మిత దిగిందేమోనన్న అనుమానంతో ఎగిరిఎగిరి చూస్తూ వున్నాడు.

ఇదంతా చూస్తున్న స్మిత హడిలి పోతోంది. కలిసికట్టుగా వున్నప్పుడు ఎన్ని వెధవ్వేషాలు వేసినా ఒంటరిగా వున్నప్పుడు ఆడపిల్లలానే బెదిరిపోయింది. ఆమెను చూసిన తక్కిన అమ్మాయిలకు ఒకసారి, చేసుకున్నమ్మకు చేసుకున్నంత అని కసిగా అనుకున్నా ఆడపిల్లల మనస్తత్వం. పాపం ఎట్లాగైనా స్మితను కాపాడాలని నిశ్చయించుకున్నారు.

"చౌరాస్తాలో దిగు. వాడి సంగతి మేం చూసుకుంటాము." తరుణి ఇచ్చిన భరోసాతో నిజాం కాలేజీ దాటేదాకా ఆతృతగా ఎదురు చూసింది.

రెడ్ సిగ్నల్ పడి వుంది. వీళ్ళ బస్ అక్కడికి చేరేటప్పటికి గ్రీన్ సిగ్నల్ పడ్డది. ముందు వాహనాలన్ని నెమ్మదిగా బయలుదేరుతుండగా "స్మితా, దిగుదిగు" అంటూ మెల్లిగా ఆమెకు బస్ దిగటంలో అమ్మాయిలు సాయం చేసారు. ఆమె దిగటం బస్ స్పీడ్ అందుకోవటం వెంటవెంటనే జరిగి పోయాయి. ఇంకా బస్ స్టాప్ రాలేదని ఎటో చూస్తున్న ఆ కుర్రాడు వెనక్కి తిరిగి చూశాడు. అక్కడ స్మిత లేకపోవటం చూసి కంగారుగా గబగబ దిగటానికి వెనక్కి వచ్చాడు.

కాని అమ్మాయిలందరూ అక్కడదడి కట్టినట్టు అడ్డంగా నిలుచొని అతనికి వెళ్ళటానికి లేకుండా చేసారు. "ఎక్స్‌క్యూజ్‌మీ ప్లీస్" అంటూ అతను అక్కడే తారట్లాడుతుంటే, అక్కడే వున్న ఒక ముసలావిడ కలగ చేసుకొని "ఏడికి పోతవయ్యా? ఆడిపిల్లల మీంకి వుర్కురికి అస్తున్నవ్. ఇంక బస్‌స్టాపే రాలె. మేం కూడ ఆడ్నే దిగుతం. నడు." అంటూ ఒక్క గదమాయింపు గదమాయించింది. దాంతొ అతను బిక్క మొహం వేసుకొని బస్‌స్టాప్ వచ్చే వరకు ఆగి దిగి చుట్టూ చూసి నిరాశగా వెనక్కు అడుగేసాడు.

"చూడు సునంద పిన్నీ చదువుకోవలసిన అబ్బాయిలు అమ్మాయిల వెంటబడటం చాల అసహ్యంగా వుంది! లూసీ గతేమయిందో. స్మితనైతే ఎలాగోలా ఈ రోజు మేము, ఆ ముసలమ్మ వుండబట్టి సరిపోయింది. అయినా ప్రతిరోజూ మనం వుండం కదా." కుసుమ కూడా సాయంత్రం వచ్చింది. తనకు కూడా విపరీతమైన ఆరాటంగా వుంది, స్మిత సంగతి ఏమయిందో ఏమోనని.

"ఇందులో అబ్బాయిలదే తప్పంతా అనటానికి లేదు కుసుమా! మీరు చెప్పుతున్నదంతా వింటుంటే మూడు వంతులు తప్పు అమ్మాయిలదే అనిపిస్తుంది. అట్లా రెచ్చకొట్టటం తప్పుకదా! ఏ పౌరుషం వున్న మగ పిల్లవాడైనా అట్లాగే రియాక్ట్ అవుతాడు."

"ఇంక లూసీ సంగతంటావా! ఆ అమ్మాయి స్నేహం మీరు తగ్గించుకుంటే మేలనిపిస్తోంది. ఎందుకో తను చెడు మార్గాన పోతున్నట్టుగా వుంది. మీరు చెప్పకలిగితే వాళ్ళ ఇంట్లో పెద్ద వాళ్ళకు చెప్పటం ఒక మార్గం. లేదూ, నోరుమూసుకొని మెల్లిమెల్లిగా ఆమెను మీ గ్రూప్ లోంచి తొలగించటం ఇంకోటి. మీరు ఆలోచించుకొని నిర్ణయించుకోండి."

"సరే పిన్నీ నువ్వు చెప్పినట్టే ఆలోచిద్దాం. అయినా ముందు తనతో మాట్లాడి చూస్తాము. తన మార్గం మార్చుకొని సీరియస్‌గా చదువులో పడిందా సరే సరి. లేకపోతే నువ్వు చెప్పినట్టే దూరం చేసుకుందాము. ఇంకా ఇది ఫస్టియరేగా!"

"ఫస్టియర్ అని తీసిపారేయవద్దు. ఇంతకు ముందర సెకండియర్‌లో లాంగ్వేజెస్ ఫైనల్ ఇయర్లో ఆప్షనల్స్ వుండేవి. ఇప్పుడేమో ప్రతి సంవత్సరం అన్ని పేపర్లూ రాయాలి. కనుక ఫస్టియర్ కూడా ఈక్వల్లీ ఇంపార్టెంట్."

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments